

తెలంగాణ ఆత్మగౌరవ పతాక, తెలంగాణతనానికి నిలువు దర్పణంగా నిలిచిన రాష్ట్ర నూతన సచివాలయం నిర్మాణ బాధ్యతలను నిర్మాణరంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీకి కేసీఆర్ ప్రభుత్వం అప్పగించింది. డాక్టర్ ఆస్కార్, పొన్ని కాన్సెస్సావా ఆర్కిటెక్ట్‌ల నేతృత్వంలో 26 నెలల రికార్డు సమయంలో తెలంగాణ ఠీవిని ప్రతిబింబించేలా కొత్త సచివాలయం రూపుదిద్దుకొన్నది.



గత కాంగ్రెస్‌పాలనలో చిమ్మచీకట్లు నిండిన తెలంగాణను వెలుగుల దివ్వెగా మార్చడంలో భాగంగా కొత్తగూడెం-మణుగూరు విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణాన్ని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ప్రాజెక్టు బాధ్యతలను భారత ప్రభుత్వానికి చెందిన నవరత్న కంపెనీ బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. ప్రతిపక్షాలు ఎన్ని కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా ప్రాజెక్టు నిర్మాణం ఆగలేదు. తెలంగాణ వెలుగులీనింది.



తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడటానికి బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే ప్రాతిపదిక అని నమ్మిన మాజీ సీఎం కేసీఆర్.. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని తలంచారు. విగ్రహ రూపకల్పన బాధ్యతలను పద్మభూషణ్ అవార్డు గ్రహీత రాంవన్‌జీ సుతార్‌కు అప్పగించారు. స్మృతివనం బాధ్యతలను ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని డిజైన్ అసోసియేట్స్‌కు ఇచ్చారు.



తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్రప్రభుత్వం వెయ్యేండ్లు నిలిచిపోయేలా పునర్నిర్మించింది. యాదగిరిగుట్ట క్షేత్రాభివృద్ధికి ప్రధాన స్థపతులు సౌందర్‌రాజన్, ఆనందాచారి వేలు, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఆనంద సాయి సహా వివిధ రంగాలకు చెందిన 44 మంది నిపుణులను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. అలా భక్తజన నారసింహ యాదగిరిగుట్ట సమారోహం ఆవిష్కృతమైంది.

# మూసీకి హార్ట్ స్ట్రోకేనా?

## మరి ఇప్పుడు..?

గత కేసీఆర్ ప్రభుత్వం ఏ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టినా.. ప్రఖ్యాత కంపెనీలకు, ప్రసిద్ధ నిపుణులకు మాత్రమే బాధ్యతలను అప్పగించింది. అందుకే, సకాలంలో ఆయా ప్రాజెక్టులు పూర్తయ్యి అందుబాటులోకి వచ్చాయి. అయితే, మూసీ సుందరీకరణపేరిట ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యతలను రేవంత్ ప్రభుత్వం వివాదాలకు కేరాఫ్‌గా నిలిచిన సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్ట్‌కే పట్టిపట్టి ఎందుకు ఇచ్చిందన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతున్నది.

### వివాదాస్పద కంపెనీకి మూసీ సుందరీకరణ ప్రాజెక్టు

### ఎల్-1ను కాదని మెయిన్‌హార్ట్‌కే కన్సల్టెన్సీ బాధ్యత

### రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలపై ఆరోపణల వెల్లువ

### భారత్‌తోపాటు విదేశాల్లోనూ మెయిన్‌హార్ట్‌పై కేసులు

### పలు ప్రాజెక్టులు మధ్యలోనే!.. నిధులు పక్కదారి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)


హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ఎక్కడో సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత ఆసక్తి ఏమిటన్న దానిపై ఇప్పుడు చర్చ జరుగుతున్నది. మూసీ రివర్‌ఫ్రంట్ మాస్టర్‌ప్లాన్ తయారీ కన్సల్టెన్సీ బాధ్యతలను ఈ సంస్థకు అప్పగించడం వెనుక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కారణమన్న ఆరోపణలూ చుట్టుముడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ కోసం గత ఫిబ్రవరి 5న ప్రభుత్వం తొలి టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ టెండర్‌లో తెలంగాణకు చెందిన సాయి కన్సల్టెన్సీ రూ. 60 కోట్లతో ఎల్-1గా నిలవగా, ట్రాక్టిబెల్ అనే కంపెనీ రూ. 75 కోట్లు కోట్ చేసి ఎల్-2గా నిలిచింది. అయితే, ఫిబ్రవరి 6న సీఎం రేవంత్‌రెడ్డిని మెయిన్‌హార్ట్ ప్రతినిధులు సచివాలయంలో ప్రత్యేకంగా కలిసి మూసీ ప్రాజెక్టుపై తమ ఆసక్తిని కనబర్చారు. అనంతరం.. జూలై 6న ఏపీ సీఎం చంద్రబాబు హైదరాబాద్‌లో రేవంత్‌తో భేటీ అయ్యారు. ఇది జరిగిన 15 రోజుల్లోనే మూసీ గత టెండర్లను రద్దు చేసిన ప్రభుత్వం.. కొత్తగా మళ్లీ బిడ్లను ఆహ్వానించింది. ఈసారి రెండు కంపెనీలు మెయిన్‌హార్ట్, లీ అసోసియేట్స్ మాత్రమే బిడ్లు దాఖలు చేశాయి. రూ. 141 కోట్లకు బిడ్ వేసిన లీ అసోసియేట్స్ ఎల్-1గా నిలవగా, రూ. 143 కోట్లకు బిడ్ వేసిన మెయిన్‌హార్ట్ ఎల్-2గా నిలిచింది. అయితే, సాంకేతిక కారణాల పేరిట ఎల్-1గా నిలిచిన లీ అసోసియేట్స్‌ను కాదని, మూసీ ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ బాధ్యతలను ప్రభుత్వం మెయిన్‌హార్ట్‌కు అప్పగించింది.

**విమర్శలు ఎదుర్కొన్న కొన్ని మెయిన్‌హార్ట్ ప్రాజెక్టులు**

- రాంచీ సిటీ డెవలప్‌మెంట్ ప్లాన్-జార్ఖండ్
- రాయ్‌పూర్ సీవరేజీ సిస్టమ్-ఛత్తీస్‌గఢ్
- డ్రైనేజీ మాస్టర్‌ప్లాన్ ఆఫ్ భోపాల్-మధ్యప్రదేశ్
- సీవరేజీ సిస్టమ్ ఆఫ్ బిలాస్‌పూర్-ఛత్తీస్‌గఢ్
- పుణె ఇంటర్నేషనల్ టెక్ పార్క్-మహారాష్ట్ర
- మెగాస్పోర్ట్స్ కాంప్లెక్స్, రాంచీ-జార్ఖండ్

#### మెయిన్‌హార్ట్‌పై ఎందుకీ ప్రేమ?

చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీకి అప్పగించింది. ఈ కంపెనీ సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. మెయిన్‌హార్ట్ కంపెనీకి సెమ్‌కాప్ అనుబంధ సంస్థగా చెప్తారు. అలా అమరావతి ప్రాజెక్టు ఒకవిధంగా మెయిన్‌హార్ట్‌కు దక్కినట్లయ్యింది. ఇక, జూలైలో చంద్రబాబుతో భేటీ తర్వాతనే మూసీ ప్రాజెక్టు మెయిన్‌హార్ట్‌కు ఖరారైంది. దీంతో మూసీ ప్రాజెక్టు ఖరారు వెనుక బాబు వ్యూహం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని బలపరుస్తూ.. అటు అమరావతికీ, ఇటు మూసీ ప్రాజెక్టుకూ నిధులివ్వడానికి చైనాలోని న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) సుముఖత వ్యక్తంచేసింది. బాబుకు మిత్రుడిగా పేరున్న ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ సహకారంతోనే ఈ రెండు ప్రాజెక్టులకు నిధులు ఖరారైనట్టు తెలుస్తున్నది. కాగా పాండ్యన్ గతంలో గుజరాత్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. ఈయన ప్రధాని మోదీకి కూడా మంచి మిత్రుడిగా చెప్తారు. అలా.. రాజకీయంగా ఎన్నో రకాలుగా విధాలుగా ముడిపడిన మెయిన్‌హార్ట్ కంపెనీని ఇక్కడి రేవంత్ ప్రభుత్వం మూసీ ప్రాజెక్టుకు ఎంపిక చేసినట్టు రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని బీఆర్ఎస్ సహా పలు రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి.



**స్టాట్యూ ఆఫ్ యూనిటీ-గుజరాత్**

నర్మదా నది తీరంలో 240 మీటర్ల ఎత్తుతో (బేస్‌తో కలిపి) సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహాన్ని నిర్మించేందుకు గుజరాత్ ప్రభుత్వం టెండర్లను పిలిచింది. ప్రాజెక్టును మెయిన్‌హార్ట్ కంపెనీ నేతృత్వంలోని కన్సార్షియం దక్కించుకొంది. అయితే, తొలుత పటేల్ కప్పుకొన్న శాలువా మీద స్వాతంత్ర్య సమరయోధుల వీరగాథలను చెక్కాలని నిర్ణయించారు. అయితే, ప్రాజెక్టు వ్యయం సరిపోదంటూ ఆ పనులను కన్సార్షియం నిలిపేసింది. భూసేకరణపై కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి.



**యమునా ఎక్స్‌ప్రెస్ వే-యూపీ**

ఆగ్రా- గ్రేటర్ నోయిడాలను కలుపుతూ 165 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారి నిర్మాణ మాస్టర్‌ప్లాన్ ప్రాజెక్టును మెయిన్‌హార్ట్ కంపెనీకి యూపీ సర్కారు కట్టబెట్టింది. అయితే, రహదారి నిర్మాణం, భూసేకరణ, మ్యాపింగ్‌లో మార్పులు వంటి వివాదాలు చుట్టుముట్టాయి. దీంతో నోయిడా ఫిల్మ్‌సిటీ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. రహదారిపై రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగాయి.



**రాంచీ సీవరేజీ, డ్రైనేజీ-పాట్నా ఎయిర్‌పోర్ట్ (జార్ఖండ్, బీహార్)**

రాంచీలో సీవరేజీ డ్రైనేజీ ప్లాన్ రూపకల్పన ప్రాజెక్టును 2005లో అప్పటి ప్రభుత్వం మెయిన్‌హార్ట్‌కు అప్పగించింది. అయితే, ప్లానింగ్‌లో లోపాలు తలెత్తినట్టు కాగ్ ఆరోపించింది. టెండర్ ప్రక్రియను, మెయిన్‌హార్ట్ అర్హతను కూడా కోర్టు ప్రశ్నించింది. నిధులు పక్కదారిపట్టినట్టు విమర్శలున్నాయి. ఇక, పాట్నా ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రాజెక్టు వ్యవహారంలోనూ మెయిన్‌హార్ట్‌పై విమర్శలు వచ్చాయి.



**వారణాసి కారిడార్-యూపీ**

ఉత్తర్‌ప్రదేశ్‌లోని హండియా-వారణాసి పట్టణాల మధ్య నాలుగు లేన్ల కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన కాంట్రాక్ట్ ప్లానింగ్‌ను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) మెయిన్‌హార్ట్‌కు అప్పగించింది. రోడ్డు పొడవు 72 కిలోమీటర్లు. అయితే, గతంలో ఉన్న రెండు లేన్లతో పోలిస్తే, నాలుగు లేన్ల రోడ్డు తరుచూ మరమ్మతులకు గురవుతున్నదన్న విమర్శలు ఉన్నాయి.

#### అమరావతిలో గ్రాఫిక్స్ మాయాజాలం

అమరావతి రాజధాని గ్రాఫిక్స్ మాయాజాలం ఏపాటిదో.. ఇటీవల వరదలతో తేలిపోయింది. తొలుత రాజధాని అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అంటూ రంగప్రవేశం చేసిన మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కన్సార్షియం.. ఆపై అవినీతికి దారులు వెతికింది. అప్పటి ఏపీ ప్రభుత్వ పెద్దలతో కలిసి కృష్ణానది తీరాన ఏకంగా రూ.66 వేల కోట్ల దోపిడీకి ఈశ్వరన్ స్కెచ్ వేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్విస్ చాలెంజ్ విధానంలో అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా సెమ్‌కాప్ కన్సార్షియంకు అప్పగించగా.. 1,691 ఎకరాలతోపాటు రూ.5,500 కోట్లు పెట్టే ఏపీ సర్కారుకు 42 శాతం వాటా, కేవలం పర్యవేక్షణ చేసే అసెండర్స్‌కు 58 శాతం వాటా దక్కేలా ఒప్పందం జరిగిందని మీడియాలో కథనాలు వచ్చాయి. కాగా ప్రపంచంలోనే అవినీతిరహిత దేశాల్లో ఐదో స్థానంలో నిలిచిన సింగపూర్‌లోనూ ఈశ్వరన్ అవినీతి చక్రవర్తిగా విరాజిల్లారు. ఇప్పుడు జైలు పాలయ్యారు.

#### ఏ ప్రాజెక్టు చేపట్టినా అంతే..

మెయిన్‌హార్ట్ కంపెనీ చేపట్టిన ప్రాజెక్టులు దాదాపుగా వివాదాల్లో కూరుకున్నవే. ఇందులో కొన్ని ప్రాజెక్టులైతే పూర్తయిన దాఖలాలూ లేవు. నర్మదా నదీతీరంలో చేపట్టిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, పాట్నా ఎయిర్‌పోర్ట్, యమునా ఎక్స్‌ప్రెస్‌వే, వారణాసి కారిడార్, పాకిస్థాన్‌లో చేపట్టిన రావి రివర్‌ఫ్రంట్ ఇలా చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. ఇక, తొలుత రూ. 50 వేల కోట్లుగా ఉన్న మూసీ ప్రాజెక్టు బడ్జెట్.. మెయిన్‌హార్ట్ రంగప్రవేశంతోనే మూడు రెట్లు పెరిగి రూ. 1.5 లక్షల కోట్లకు చేరాయన్న విమర్శలూ వస్తున్నాయి.



రేవంత్‌రెడ్డిని ఇక మూసీరెడ్డి అనే పేరుతో పిలవాలనే పోస్టర్ చూపుతున్న బక్క జడ్సన్

## రేవంత్ పేరు ఇక మూసీరెడ్డి

**ఆ పేరు ఆయనకే సూటవుతుంది**

**కాంగ్రెస్ మాజీ నేత బక్క జడ్సన్**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ మాజీ నేత, సామాజిక కార్యకర్త బక్కజడ్సన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను స్ఫూర్తిగా తీసుకుని ఆయనను ఇకపై మూసీరెడ్డిగా పిలవాలని పేర్కొన్నారు. ఆ నదికి ఆయన అంబాసిడర్‌గా వ్యవహరించాలని సూచించారు. మూసీ వెంబడి ఉన్న ఫార్మా కంపెనీలతో నది విషతుల్యం అవుతున్నదని పేర్కొన్నారు. వ్యర్థాలు వదులుతున్న ఆ కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మూసీలోకి వ్యర్థాలు రాకుండా నియంత్రించడం మానేసి ఫార్మా కంపెనీల నుంచి కోట్ల రూపాయలు డొనేషన్ల రూపంలో ప్రభుత్వం స్వీకరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మూసీ పేరును ఎందుకు పెట్టుకోవడం లేదని ప్రశ్నించిన రేవంత్‌కే ఆ పేరు సరిపోతుందని తెలిపారు.



### హైడ్రా బతుకమ్మ..

హైడ్రా పేరిట పేదల ఇండ్ల కూల్చివేతలను చూసి తెలంగాణ తల్లి కన్నీళ్లు పెట్టుకుంటున్నట్టుగా ఉన్నదీ బతుకమ్మ. దీనిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన కొయ్యడ వెంకన్న దంపతులు తీర్చిదిద్దారు.

-కొత్తగూడెం సింగరేణి



రావి ప్రాజెక్టు పూర్తయ్యాక పాక్‌ను ఇలా మారుస్తామంటూ మెయిన్‌హార్ట్ విడుదల చేసిన గ్రాఫిక్ ఫొటోలు



రూ. 15 వేల కోట్లు ఖర్చయినా.. ఏమాత్రం మారని రావి నది పరిస్థితి

# థేమ్స్ మాడల్ కాదు.. పాక్ మాడల్!

- పాక్‌లో రావి ప్రాజెక్టును నట్టేట ముంచిన కంపెనీ ఇదే
- సీవరేజీ ట్రీట్మెంట్ చేయకుండానే ఇండ్ల కూల్చివేతలు
- ప్రాజెక్టు వ్యయం ఏకంగా రూ.2.5 లక్షల కోట్లకు పెంపు
- రూ.15 వేల కోట్లు ఖర్చు పెట్టించి ఆ తర్వాత హ్యాండ్సప్
- వేల కోట్ల స్కామ్‌లకు పాల్పడినట్టు 'మెయిన్‌హార్ట్'పై కేసులు
- రావి ప్రాజెక్టు మెయిన్‌హార్ట్‌కు రావడంలో కంపెనీ డైరెక్టర్ పాత్ర!
- వివాదాస్పద కంపెనీ మెయిన్‌హార్ట్‌కు మూసీ ప్రాజెక్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): మూసీ అభివృద్ధికి థేమ్స్ మాడల్‌ను అమలు చేస్తామంటున్న సీఎం రేవంత్ రెడ్డి నిజానికి పాకిస్థాన్ మాడల్‌ను ఫాలో అవుతున్నట్టు అర్థమవుతున్నది. పాకిస్థాన్‌లోని రావి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును మధ్యలోనే అటకెక్కించి, వేల కోట్ల స్కామ్‌లకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సింగపూర్‌కు చెందిన వివాదాస్పద మెయిన్‌హార్ట్ కంపెనీకి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుమాస్టర్ ప్లాన్ బాధ్యతలను కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాక్‌లో రావి రివర్ ఫ్రంట్ పేరిట నదీపరీవాహంలోని ఆవాసాలను కూల్చినట్టే ఇక్కడ కూడా మూసీ సుందరీకరణ పేరిట బడుగువర్గాలు కట్టుకున్న ఇండ్లను కాంగ్రెస్ సర్కారు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నది. దీంతో థేమ్స్ మాడల్ కాదు.. పాక్ మాడల్‌ను రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్నదంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### జీవితకాలం లేటు

ఏదైనా ఒక ప్రాజెక్టు ప్రారంభం కావాలంటే.. ఏడాది, ఐదేండ్లు, పదేండ్ల వరకూ సమయం పట్టొచ్చు. అయితే, 77 ఏండ్ల కిందట ప్రతిపాదించిన ఓ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పట్టాలు ఎక్కలేదంటే నమ్మగలమా? పాకిస్థాన్ ఇందుకు వేదికగా నిలిచింది. భారత్ నుంచి విడిపోయిన 1947లో రావి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును అప్పటి పాక్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అలా దాదాపు 73ఏండ్లు వాయిదాపడుతున్న ఈ ప్రాజెక్టును 2020లో ఎట్టకేలకు అప్పటి ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం మళ్లీ తెరమీదకు తీసుకొచ్చింది. రూ. 40 వేల కోట్లతో 44 వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును చేపట్టాలని లాహోర్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్ణయించింది. ఈ మేరకు సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కంపెనీకి రావి రివర్‌ఫ్రంట్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఆర్ఆర్‌యూడీపీ) ప్లానింగ్ బాధ్యతలను అప్పగించింది.

#### ప్రాజెక్టు ఎలా వచ్చిందంటే?

రావి ప్రాజెక్టు మెయిన్‌హార్ట్‌కు దక్కడంలో పాకిస్థాన్‌లోని మెయిన్‌హార్ట్ శాఖ ఆపరేషన్స్ విభాగంలో డైరెక్టర్‌గా గతంలో పనిచేసిన అమీన్ కీలకపాత్ర పోషించినట్టు చెప్తారు. 2012-2020 మధ్య ఆయన మెయిన్‌హార్ట్‌లో కీలక బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2020 ఏప్రిల్‌లో రావి రివర్‌ఫ్రంట్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే మెయిన్‌హార్ట్‌కు ఈ రావి ప్రాజెక్టు ఖరారైనట్టు చెప్తారు. అయితే, ఈ డీల్ జరిగినప్పుడు తాను ఆర్ఆర్‌యూడీపీ సీఈవోగా బాధ్యతలు చేపట్టలేదని అమీన్ చెప్తుండటం గమనార్హం.

**సేమ్ టు సేమ్?!**

| | |
|---|---|
| ప్రాజెక్టు పేరు: రావి రివర్ ఫ్రంట్ | ప్రాజెక్టు పేరు: మూసీ రివర్ ఫ్రంట్ |
| ప్రాంతం: లాహోర్, పంజాబ్, పాకిస్థాన్ | ప్రాంతం: హైదరాబాద్, తెలంగాణ, ఇండియా |
| ప్రాజెక్టు పొడవు: 46 కిలోమీటర్లు | ప్రాజెక్టు పొడవు: 55 కిలోమీటర్లు |
| మాడల్: థేమ్స్, లండన్ | మాడల్: థేమ్స్, లండన్ |
| ప్రాజెక్ట్ అప్పగించిన కంపెనీ: మెయిన్‌హార్ట్ | ప్రాజెక్ట్ అప్పగించిన కంపెనీ: మెయిన్‌హార్ట్ |
| లక్ష్యం: రావి ప్రక్షాళన, సుందరీకరణ | లక్ష్యం: మూసీ ప్రక్షాళన, సుందరీకరణ |
| తొలుత అంచనా వ్యయం: రూ. 40 వేల కోట్లు | తొలుత అంచనా వ్యయం: రూ. 50 వేల కోట్లు |
| మెయిన్‌హార్ట్ ఎంట్రీతో వ్యయం: రూ. 2.5 లక్షల కోట్లు | మెయిన్‌హార్ట్ ఎంట్రీతో వ్యయం: రూ. 1.5 లక్షల కోట్లు |
| తొలిదఫాలో చేసింది: ప్రక్షాళన పక్కనబెట్టి ఇండ్ల కూల్చివేత | తొలిదఫాలో చేస్తున్నది: ప్రక్షాళన పక్కనబెట్టి కూల్చివేత |
| ఆ తర్వాత: బాధితుల ఫిర్యాదుతో న్యాయపరమైన చిక్కులు | ఆ తర్వాత: సర్కారుపై బాధితుల ఫైర్, కోర్టుల్లో పిటిషన్లు |
| అప్పుడేమైంది: రూ. 15 వేల కోట్లు దండుకొని ఉడాయించిన మెయిన్‌హార్ట్ | ఏం కాబోతున్నది: ???? |

#### అమాంతం వ్యయం పెంపు

లండన్‌లోని థేమ్స్ మాడల్‌ను రావి రివర్ ఫ్రంట్‌లో అమలు చేస్తామంటూ గ్రాఫిక్స్ డిజైన్స్‌తో మెయిన్‌హార్ట్ కంపెనీ పాక్ సర్కారును బురిడీ కొట్టించినట్టు విమర్శలు ఉన్నాయి. పాకిస్థాన్‌లోని హక్కుల కార్యకర్తల కథనం ప్రకారం.. తొలుత 44 వేల ఎకరాల్లో చేపట్టాలనుకొన్న ప్రాజెక్టును 1,02,074 ఎకరాలకు విస్తరింపజేసింది. ప్రాజెక్టు వ్యయాన్ని కూడా రూ. 2.5 లక్షల కోట్లకు పెంచింది. అయితే 46 కిలోమీటర్ల మేర చేపట్టే ప్రాజెక్టుకు ఇంతమేర నిధులు ఎందుకంటూ అక్కడి ప్రతిపక్షాలు, హక్కుల కార్యకర్తలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. దీంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టులో భాగంగానే ఓ అర్బన్ ఫారెస్టు, మూడు బరాజ్‌లు, ఆరు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, ఓ సరస్సు, 60 లక్షల చెట్లను ఏర్పాటు చేస్తామని మెయిన్‌హార్ట్ ప్రకటించినట్టు సామాజిక కార్యకర్తలు విమర్శిస్తున్నారు. తొలిదశలో భాగంగా రూ. 15 వేల కోట్లను ప్రభుత్వం నుంచి తీసుకొని ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తున్నట్టు కంపెనీ వెల్లడించిందని అయితే, ప్రాజెక్టు ఏమాత్రం ముందుకు జరుగలేదని మండిపడ్డారు.

#### పేదల ఇండ్ల కూల్చివేతలే లక్ష్యం

రావి రివర్ ఫ్రంట్‌లో థేమ్స్ మాడల్‌ను అనుసరిస్తామన్న ప్రభుత్వం స్వీయ మాడల్‌ను ఫాలో అయ్యింది. నదీప్రక్షాళనకు తొలుత సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాల్సిఉండగా, ముందుగా నదీపరీవాహంలోని పేదల ఇండ్లు, చిరువ్యాపారుల వాణిజ్య సముదాయాలను తొలగించిందని హక్కుల కార్యకర్తలు వెల్లడించారు. నది ఒడ్డున ఉన్న రైతుల వందలాది ఎకరాల భూములను ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం సేకరించిందని, తగిన పరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆ భూముల్లో కొన్నింటిని కార్పొరేట్లకు కట్టబెట్టారని మండిపడ్డారు. దీంతో పలువురు లాహోర్ హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన ధర్మాసనం అక్రమాలు జరిగినట్టు గుర్తించి అటు ప్రభుత్వాన్ని, ఇటు మెయిన్‌హార్ట్ కంపెనీని తీవ్రంగా తప్పుబట్టినట్టు, ప్రాజెక్టును నిలిపేసినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. అనంతరం హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు జరుగలేదని సామాజికవేత్తలు తెలిపారు.

#### మెయిన్‌హార్ట్ మోసాలు ఇలా..

ఒకవైపు రావి రివర్ ఫ్రంట్ వివాదం కొనసాగుతుండగానే మెయిన్‌హార్ట్ తన అక్రమాలకు తెరతీసినట్టు విమర్శలు ఉన్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. పాక్‌లోని ఓ రెసిడెన్షియల్ ప్రాజెక్టులో స్థానిక ప్రైవేటు బ్యాంకుతో కలిసి ఇండ్ల కొనుగోలుదారులను వేల కోట్ల రూపాయల మేర మోసం చేసినట్టు సంస్థపై ఓ కేసు నమోదైంది. రూ. 300 కోట్ల మేర హవాలా కుంభకోణానికి పాల్పడినట్టు మరో అభియోగం నమోదైంది. ఇదే సమయంలో మధ్యలో నిలిపేసిన రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును కొనసాగించాలని మెయిన్‌హార్ట్‌పై ఒత్తిళ్లు పెరిగాయి. అయితే, కోర్టుల్లో కేసులు, ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయన్న నెపంతో తాము ఈ ప్రాజెక్టును చేపట్టలేమని కంపెనీ చేతులెత్తేసినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. అలా రావి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులో పాక్ ప్రభుత్వాన్ని, ప్రజలను రూ. 15 వేల కోట్ల మేర మెయిన్‌హార్ట్ మోసం చేసిందని సామాజిక కార్యకర్తలు మండిపడ్డారు. అందుకనే కంపెనీ యజమాని నసీం షెహజాద్, ఆయన కొడుకు, కంపెనీ సీఈవో ఒమర్ షెహజాద్‌పై పలు కేసులను సర్కారు నమోదు చేసిందని, దీంతో వీళ్లిద్దరూ పాక్‌ను విడిచి వెళ్లిపోయారని తెలిపారు. ఈ క్రమంలోనే నసీం షెహజాద్, ఒమర్ షెహజాద్‌ను దేశం విడిచి పారిపోయిన నేరగాళ్లుగా పాక్ ప్రభుత్వం గత నవంబర్‌లో ప్రకటించినట్టు చెప్తున్నారు. అయితే, ఈ విమర్శలను మెయిన్‌హార్ట్ ఖండిస్తున్నది. కాగా.. ఇలాంటి వివాదాల్లో కూరుకుపోయిన మెయిన్‌హార్ట్ కంపెనీకి రేవంత్ ప్రభుత్వం మూసీ ప్రాజెక్టు కన్సల్టెన్సీ బాధ్యతలను అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### ఫండింగ్ రాలేదు.. ఎందుకంటే?

తెలంగాణలో మూసీ ప్రాజెక్టుకు, అటు ఏపీలోని అమరావతి నిర్మాణానికి చైనాలోని న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) ఫండింగ్ ఇవ్వడానికి రెడీ అయ్యింది. ఈ రెండు ప్రాజెక్టుల ప్లానింగ్‌ను మెయిన్‌హార్ట్ చేపడుతుండటం, మెయిన్‌హార్ట్ కంపెనీలో కీలక భాగస్వామి అయిన సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ మంచి మిత్రుడు కావడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. అయితే పాక్‌లోని రావి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్లానింగ్‌ను కూడా మెయిన్‌హార్ట్ కంపెనీ చేపట్టినప్పటికీ, ఎన్డీబీ నిధులివ్వకపోవడం గమనార్హం. దీనికి కారణం.. బ్రిక్స్ కూటమి దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ప్రభుత్వాలు లేదా ప్రైవేటు కంపెనీలు చేపట్టే పలు ప్రాజెక్టులకు మాత్రమే ఈ బ్యాంకు ఆర్థిక సాయాన్ని సమకూర్చాలనే నిబంధనలు ఉన్నాయి. పాక్ బ్రిక్స్ కూటమిలో లేకపోవడంతో ఎన్డీబీ రావికి ఫండింగ్ ఇవ్వలేకపోయిందని నిపుణులు చెప్తున్నారు.